# నిద్రాదేవి చల్లటిచూపు లేని రాత్రి

రచన:

శ్రీ అడపా రామకృష్ణరావు

నిద్రపోవాలని కొన్నిగంటలనుంచి శుష్క-ప్రయత్నాలు చేస్తున్నాను. నిద్రాదేవిమాత్రం కటాక్షించకుండా వుంది. మెదడులో అనేకమైన వూహలు మోసులెత్తి, ఒకదానితో ఒకటి పెనవేసుకుని, తామరతంపరగా పెరిగి, జిగిబిగిగా అల్లుకుని పాకిపోతున్నై. క్షణక్షణం తీగెలు సాగే ఈ వూహాపోహల వూపులో, ఈ నిట్టూర్పుల వేడిలో, ఈ కనుపాపలమంటలో నిద్రపట్టదన్న సూచన కనిపిస్తూనే వుంది.

"యత్నేకృతే యది నసిద్ధ్యతి కోత్ర దోషః" అని పెద్దలన్నారు. పురుషప్రయత్నమేమో చెయ్యవలిసిందే. నా ప్రయత్నలోప మేమీ లేదు. ఐనా అమ్మవారనుగ్రహించకపోతే ఏం చేసేది?

*

"కస్తూరి రంగ రంగా, నా యన్న, కావేటి రంగరంగా"— చంటిపిల్లని జోకొడుతున్నది యెదురింటి మాతృదేవి.

"ఆటుపోటుల జీవితపు పరుగులో నడుమ చిన్న శాంతిస్వప్నాల గొలుసు—నిద్ర! నిద్రపోనీండి నన్ను"—అంటున్నాడు రవీంద్రుడు బుక్ షెల్ఫునించి తొంగిచూస్తూ.

"సోజా—సోజా—మేరీ రాగిణీ" రేడియోగ్రాం తుతో పాడేస్తున్నది మోతీ. సుశీలారాణికూడా గొంతు కలుపుతోంది: "శీతల చాందినీ ఆయి హై......"

అంతా జోలపాడేవారే. అంతా నిద్రపుచ్చేవారే. కాని ఇంతాచేసి నిద్రే రాకుండా వుంది!

*

విశ్వశిక్షాస్మృతిలో నిద్రాదేవి అత్యాచారాలకేమీ ఆక్షేపణ లేదు. ఆమె అలివిమాలిన పనులకేవీ అంతరాయాలు లేవు. తెల్లవారితే పరీక్షకి కూచోవలిసి వచ్చి, రాత్రి గంటగంటకీ టీ తాగుతూ నిద్రను నిర్జించాలని వెయ్యివిధాల కష్టపడే బడిపిల్లల్ని, దాసుగారి గానసుధారసాన్ని తనివితీరా చవిచూడాలని దబ్బున ఇంటిపనులు చక్కబెట్టుకుని హరికథకు వెళ్లే భక్తజనాన్ని, జీవనమరణ సమస్య నెదుర్కొంటున్న రోగికి ప్రాణం పొయ్యాలని కృషిచేసే డాక్టరమ్మను- వొద్దన్నా వినక కోరికోరి లాలించినిద్రపుచ్చుతుంది. ఇంక పగలల్లా అంకెలతో, అక్షరాలతో ఘరచక్రాలై తిరిగితిరిగి చల్లటివేళ ఇంటిపట్టుకు చేరుకుని కాస్త కన్ను మూయాలనుకున్న వారిని చికాకుపరచి లేపి కూచో బెడుతుంది. ఏం న్యాయం!

*

లోకమంతటా వున్న తరతమభేదాలు నిద్రాదేవి అపాంగావలోకానికి నోచుకోడంలోనూ వుండనే వున్నై. ఒక్కొక్కరిపట్ల ఆమె కింతింత తనరాని వాత్సల్యం. ఒక్కొక్కరిపట్ల త్రాచుపాము మల్లే తీరని పగ!

కుంభకర్ణునికన్న అల్లారుముద్దుబిడ్డ ఈఅనంత విశ్వంలో మరొకరు లేరు కదా ఆమెకి. ఎంత వాత్సల్యం అతడంటే? తన వొళ్ళోనించి దింపితే బిడ్డ ఏమి కందిపోతాడోనని చెప్పి బ్రతికినన్నాళ్లూ కళ్ళారా కవిపెడుతూవచ్చింది.

రిప్‌వాన్ వింకిల్ మహానుభావుడు ఒకానొక సంధ్యాసమయాన కాట్‌స్కిల్ పర్వతమెక్కి, చల్లగాలికి జోగి కన్ను మూసిననాడు మూసినట్టు మళ్ళీ ఇరవైయేళ్ళవఱకూ యేకదీక్షగా నిద్రపోయాడట. ఆదంతా అతనికోరాత్రిప్రాయంగా తోచిందట. దిగి వూళ్ళోకి వెడితే మనుషులు కొత్త! రూపరేఖలు కొత్త! ఇళ్ళు మేడలూ కొత్త! వూరే కొత్త! 'కలయో, వైష్ణవమాయయో' అని అప్పుడనుకున్నాడట. మరో ముద్దుబిడ్డ నిద్రాదేవికి!

*

క్లైవు విషయం చూస్తే — మనదేశంలో

బ్రిటిష బీజం నాటి నీరుపోసినవాడు, యుద్ధాలు గెలిచి, దేశాలు పాలించి, వెలుగు వెలిగించిన వాడు చివరిరోజుల్లో మనశ్శాంతిలేక అటమటించి యింత బ్రతుకూ బ్రతికినవాడు చివరికి 'నిద్రలేమి' రోగంతో కుళ్లి చేజేతులా ఆత్మహత్య చేసుకుని దిక్కుమాలిన చావు చచ్చాడంటుంది చరిత్ర.

యుద్ధాలు చేస్తేనేం? వూళ్ళేలితేనేం? ఏం గొప్ప! రాజులకురాజుల్ని శాసించి వుండవచ్చు కానీ నిద్రాదేవి చల్లటి చూపుకి నోచుకున్నాడా?

*

నిద్రతో ఆడుకున్న మహాపురుషుల్ని ఒకరిద్దఱిని ప్రపంచచరిత్ర తెలుసుకోకపోలేదు.

నెపోలియన్ వున్నాడు. ఆయన యెప్పుడు కోరితే అప్పుడు నిద్రపట్టేదట. గుఱ్ఱంమీద స్వారి చేస్తూ నిద్రపోయినరోజులున్నాయట ఆయన జీవిత చరిత్రలో.

ఇక మన గాంధీజీ సరే సరి. ఒకమాటు కారులో యెక్కడికో వెడుతూవుండగా కునుకుపట్టిందట. త్రోవలో కారు ప్రమాదానికి గురికాగా గాంధీజీ యెగిరి అల్లంత దూరాన పడ్డాడట. 'ఏం దెబ్బ తగిలిందో బాపూజీ' కని అందరూ ఆతురతతో చుట్టుముట్టి చూస్తే యేముంది—ఇంకా నిద్రపోతూనే వున్నాడట!

*

నిద్రలో ఒక బాలాజనకుసుమాస్త్రుణ్ణి చూసి లేచాక వెతికించి పెళ్లాడింది ఉషాకుమారి. ఇంక నిద్రలో కన్నీటిముత్యాలు జారువార్చే కోమలాంగులూ, నిద్రలో కవిత్వం చెప్పే మహాకవులూ. నిద్రలో సంగీతంపాడే గాయకులూ, సంగీతంతో నిద్రపోయే రసజ్ఞులూ—నిద్రను ఆవరణగా చేసుకుని యెన్నో అభిరుచులు! ఎన్నో అభ్యాసాలు!

నాగస్వరం పాడితే త్రాచుపాము నిద్రిస్తుంది. జోలపాట పాడితే పాలపాప పండుకుంటుంది. రాధాదేవి హాసలేశం సోకితే కృష్ణయ్య కన్నుమూస్తాడు. కనన్‌దేవి కంఠస్వరం కదిపితే బారువా నిద్రపోతాడు.

కాని మనల్ని—క్షమించండి నన్ను—నిద్రపుచ్చడానికి యెవరు తీరిక చేసుకుకూచున్నారిక్కడ? యేదో ఒకవిధంగా నేనే పవళించాలి. తప్పదు!





COME TO US
FOR THE ANSWER
WE HAVE EXPERT STAFF
IN OUR REPAIRING
DEPARTMENT
JALAL & SONS
RATTAN BAZAAR, MADRAS.

Branches | Mount Rd., Madras.
Abid Rd., Hyderabad (Dn.)
Kingsway, Secunderabad (Dn)